www.vishalabharati.com
epaper:vishalabharati.com

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
బుధవారం | 08.05.2024 | హైదరాబాద్

# పార్లమెంట్ ఫైట్ @2024

PARLIAMENT FIGHT





- ప్రచారంలో దూకుడు పెంచిన సీఎం రేవంత్‌రెడ్డి
- కాంగ్రెస్ కేడర్‌లో జోష్ పెంచుతున్న రోడ్‌షోలు
- అత్యధిక స్థానాల్లో గెలుపు దిశగా వ్యూహాలు
- కీలకమైన నియోజకవర్గాలపై ప్రత్యేకంగా ఫోకస్
- అగ్రనేత రాహుల్ రాకతో అమాంతం పెరిగిన గ్రాఫ్
- కాంగ్రెస్ ప్రణాళికలతో బీజేపీ, బీఆర్ఎస్ ఉక్కిరి బిక్కిరి
- రేవంత్ మార్క్ రాజకీయంతో బీఆర్ఎస్ ఖేల్ ఖతం
- గాడిదగుడ్డు ప్రచారంతో మోడీ క్రేజీ ధమాల్
- దేశ వ్యాప్తంగా 'ఇండియా' కూటమికి పెరుగుతున్న ఆదరణ

# జన జాతరకు నీరాజనాలు

**పార్లమెంట్ ఎన్నికలకు గడువు సమీపిస్తుండడంతో అధికార కాంగ్రెస్ ప్రచారంలో దూకుడు పెంచింది. వరుసగా నిర్వహిస్తున్న 'జనజాతర' సభలు విజయవంతంతో కాంగ్రెస్ కేడర్‌లో జోష్ మరింత పెరుగుతోంది. దీంతో కాంగ్రెస్ అధినాయకత్వం ప్రస్తుత సానుకూల పరిస్థితులను అవకాశంగా మలుచుకొని రాష్ట్ర వ్యాప్తంగా పార్లమెంట్ స్థానాల్లో విజయం సాధించే దిశగా పని చేస్తోంది.**

**- విశాల భారతి, స్టేట్ బ్యూరో**

## విజయం నల్లేరుపై నడకే..



రాష్ట్రంలోనే అత్యంత కీలకమైన నియోజకవర్గాలపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టింది. స్వయంగా చేవెళ్ల పార్లమెంట్‌కు సీఎం రేవంత్‌రెడ్డి ఇన్‌చార్జిగా ఉన్నారు. అలాగే మల్కాజిగిరి స్థానం సైతం నిన్నమొన్నటి వరకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిథ్యం వహించిన ఎంపీ స్థానం. ఈరెండింటిని గెలుచుకునేందుకు కాంగ్రెస్ నేతలు ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ రెండు స్థానాల్లో పార్టీని గెలుపు తీరాలకు చేర్చడం సీఎంకి నల్లేరుపై నడకే అని నిపుణులు అంటున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో చేపట్టిన కాంగ్రెస్ జనజాతర సభలు విజయవంతంగా సాగుతున్నాయి. పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, జాతీయ, రాష్ట్ర నేతలు రావడంతో ప్రచారంలో దూకుడు పెరిగింది. ప్రజలు లక్షలాదిగా స్వచ్ఛందంగా తరలి వస్తున్నారు.

## ఇక్కడా పెత్తనమేనా?




ఇదిలా ఉంటే నిన్నమొన్నటి వరకు బీఆర్ఎస్‌లో అధికారం చెలాయించిన నేతలు ఇపుడు కాంగ్రెస్ లో చేరి ఇక్కడా పెత్తనం చేస్తుండడంపై క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ శ్రేణుల నుంచి కొంత వ్యతిరేకత వ్యక్తమవుతోంది. చేరికల సమయంలో కనీసం తమకు సమాచారం కూడా ఇవ్వకుండా కొత్తగా పార్టీలో చేరిన వారితోనే వ్యవహారాలన్నీ నడుపుతున్నారని సీనియర్లు గుర్రుగా ఉన్నారు. కాంగ్రెస్ లో చాపకింద నీరులా ఉన్న అసమ్మతి ఇబ్బంది పెట్టే అవకాశం ఉంది. పార్టీ అధినాయకత్వం అందరికీ డోర్లు తెరుస్తామంటూ పదే పదే ప్రకటిస్తోందని, కాంగ్రెస్ ను మోసం చేసిన వారిని, దొంగలను లోపలికి తీసుకువస్తే మాలాంటి కార్యకర్తలు నష్ట పోతారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందరినీ కలుపుకు పోవాలని సూచిస్తున్నారు.

## పక్కా ప్రణాళికలు..

రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లాల వ్యాప్తంగా కాంగ్రెస్ ప్రచారం చేపట్టనుంది. మొత్తం 17 పార్లమెంట్ స్థానాలలో ప్రచారం పూర్తి చేయాలని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. ముఖ్యంగా నల్లగొండ, ఖమ్మం, కరీంనగర్, వరంగల్, మహబూబ్ నగర్ జిల్లాల పరిధిలో పార్లమెంట్ స్థానాలను కైవసం చేసుకునేందుకు ఫక్కా ప్రణాళికలు వేస్తున్నారు. జనజాతర సభలతో నూతనోత్సాహంతో ఉన్న కేడర్‌ను మరింత కార్యోన్ముఖులను చేసి ఎన్నికల వరకు ఇదే జోష్‌ను కొనసాగించేందుకు పార్టీ నాయకత్వం తగిన వ్యూహరచనలు చేస్తోంది. జిల్లా ఇన్‌చార్జి మంత్రులు, ఇతర ముఖ్య నేతలు, డీసీసీ అధ్యక్షులు స్థానిక నాయకులు, కార్యకర్తలతో రోజువారీ సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు.




## బీఆర్ఎస్ బలహీనం?

కొన్ని నియోజకవర్గాల్లో త్రిముఖ పోటీ నెలకొనడంతో కాంగ్రెస్ పైచేయి సాధించేందుకు శ్రమిస్తోంది. క్షేత్రస్థాయిలో ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ రోజు రోజుకూ బలహీనపడుతుండడంతో కాంగ్రెస్‌కు బీజేపీతోనే గట్టిపోటీ నెలకొనే పరిస్థితులు కన్పిస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్ క్రమంగా పట్టును కోల్పోతోంది. ముఖ్యనేతలంతా అధికార కాంగ్రెస్‌తో పాటు బీజేపీ వైపు చూస్తున్నారు. కీలక నేతల్లో ఎక్కువ మంది ఇప్పటికే పాలక కాంగ్రెస్‌లో చేరారు. త్వరలో కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కాంగ్రెస్‌లో చేరతారనే ప్రచారమూ సాగుతోంది. దీంతో గులాబీ పార్టీలో గుబులు రేగుతోంది. ఎన్నికల అంచున ఇప్పటికిప్పుడు ప్రత్యామ్నాయ నాయకత్వాన్ని తయారు చేసుకోలేక పార్టీ బలహీనపడుతోంది. ఎన్నికలు మరో నెల రోజులకు పైగా ఉన్న నేపథ్యంలో పోటీ ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీల మధ్యే ఉంటుందనే ప్రచారం సాగుతోంది.



## ధీటుగా నిలిపేందుకు..



మరో వైపు కొన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ తరుపున పోటీ చేస్తున్న అభ్యర్థులు బీఆర్ఎస్ నుంచి వచ్చిన వారే కావడం కొందరు స్థానిక నేతలకు రుచించడం లేదు. దీంతో అసంతృప్త నేతలు ఇప్పటికీ ఎన్నికల ప్రచారాల్లో అంటీ ముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఈ పరిస్థితులను అధిగమించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నేరుగా రంగంలో దిగారు. ఆరు నూరైనా రాష్ట్రంలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిందే అనే సందేశాన్ని కేడర్‌కు ఇస్తున్నారు. దీనికి అనుగుణంగా రోజూ ఏదో ఒక ఎదుటి పార్టీల నేతలు, నాయకులు, కార్యకర్తలను చేర్చుకునే పనిని ముమ్మరం చేశారు. దీంతో హస్తం పార్టీ బలోపేతం అవుతుంది.

## మెజారిటీ సీట్లు గ్యారెంటీ

పార్టీలోకి ఎవరొచ్చినా ఎంతో కొంత బలమే కదా అన్నట్టుగా కాంగ్రెస్ నాయకులు చేరికలను ప్రోత్సహిస్తున్నారు. లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో చేరికలను పెంచడంతో పాటు పార్టీ ప్రచార కార్యక్రమాలనూ ముమ్మరం చేస్తున్నారు. నిత్యం పార్లమెంట్ నియోజక వర్గాల పరిధి నేతలతో మాట్లాడుతున్నారు. అసంతృప్త నేతలతో వ్యూహ రచనపై చర్చిస్తున్నారు. ఏ పార్టీలో నుంచి చేరిన వారినైనా అందరితో కలిసిపోవాలని సూచిస్తున్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో విజయం సాధించేందుకు ప్రణాళికలతో కాంగ్రెస్ దూసుకుపోతోంది.

